ఈనాడు
విజయనగరం
గురువారం సెప్టెంబరు 26, 2024

రాకపోకలు.. ఒకే ఒక్కరోజు..

● మళ్లీ దెబ్బతిన్న కాజ్‌వే
● నిలిచిన వాహనాలు
● దారి మళ్లించిన పోలీసులు


కాజ్‌వే మీదుగా పారుతున్న నీరు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పారాది వద్ద వేగావతి నదిపై తాత్కాలికంగా నిర్మించిన కాజ్‌వే మీదుగా బుధవారం మళ్లీ నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీనిని రెండు రోజుల కిందటే మరమ్మతులు చేశారు. కొత్త వంతెన నిర్మించే వరకు ఈ బాధలు తప్పవని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు.

కాజ్‌వే నిర్మించడానికి రూ.94 లక్షలు ఖర్చయింది. కొత్త వంతెన నిర్మాణానికి ఏడాదిన్నర పడుతుందని సంబంధిత అధికారులే అంటున్నారు. అంత వరకు కాజ్‌వే ఉంటుందనే నమ్మకం లేకుండా పోయింది. ఇప్పటికే ఐదు సార్లు మరమ్మతులు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. తాజాగా ఒక్కరోజే వాహనాలు ప్రయాణించాయి.

రూ.30 కోట్ల రహదారులు గుల్ల

కాజ్‌వే పాడైపోవడంతో బొబ్బిలి నుంచి తెర్లాం వెళ్లే రహదారి, రామభద్రపురం నుంచి బాడంగి దారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వీటి విలువ దాదాపు రూ.30 కోట్లు వరకు ఉంటుందని ర.భ శాఖ అధికారులు అంచనా వేశారు. రూ.11 కోట్లు పెట్టి కొత్త వంతెన సకాలంలో నిర్మిస్తే ఇంత నష్టం జరిగి ఉండేది కాదని అంటున్నారు.

బొబ్బిలి-తెర్లాం మీదుగా..

ప్రస్తుతం విశాఖ వైపు వెళ్లే భారీ వాహనాలు బొబ్బిలి-తెర్లాం మీదుగా, విశాఖ నుంచి వచ్చే వాహనాలు రామభద్రపురం- బాడంగి మీదుగా మళ్లించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సతీష్‌కుమార్ పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా మార్గాల్లో గోతులు ఏర్పడి వాహనాలు కూరుకుపోయి, బోల్తా పడ్డాయి. బుధవారం నుంచి వాహనాలు మళ్లించడంతో ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని వాహన చోదకులు భయపడుతున్నారు. కాజ్‌వేకు మళ్లీ మరమ్మతులు చేస్తామని ఏఈ రాజు తెలిపారు.


అలజంగి వద్ద పాడైన రహదారి

పైడితల్లి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట ప్రసాద్ బుధవారం పైడితల్లిని దర్శించుకున్నారు. వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం ఆశీర్వచనాలు అందించారు. సహాయ కమిషనర్ ప్రసాదరావు ఉన్నారు. – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

ఎవరి కోసం ఈ గోదాములు!

వైకాపా అయిదేళ్ల పాలనలో తమ వారికి లాభం కలుగుతుందంటే చాలు పచ్చజెండా ఊపింది. ఇందుకు ఉమ్మడి విజయనగరం జిల్లాలో మంజూరు చేసిన బహుళ ప్రయోజన సౌకర్య (ఎంపీఎఫ్‌సీ) గిడ్డంగులే అద్దం పడుతున్నాయి.


గజపతినగరం కొత్తబగ్గాంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గోదాము

ఈనాడు, విజయనగరం: రైతులు తమ ఆహారోత్పత్తులను నిల్వ చేసుకుని, వాటికి మద్దతు ధర లభించినప్పుడు విక్రయించుకునేందుకు కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా విజయనగరం జిల్లాలో 44 గోదాములు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఆరు రద్దయ్యాయి. మిగిలిన 38లో 500 టన్నుల సరకు నిల్వ సామర్థ్యం ఉన్నవి 35, వెయ్యి టన్నుల సామర్థ్యం ఉన్నవి 3 ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో 20 మంజూరయ్యాయి. 500 టన్నుల సామర్థ్యం ఉన్న ఒక్కొక్క దానికి రూ.40 లక్షలు, 1000 టన్నుల సరకుల నిల్వ సామర్థ్యం ఉన్న ఒక్కొక్క గోదాము రూ.75 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టారు. వీటి నిర్మాణానికి నాబార్డు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేసింది. పూర్తయిన తర్వాత సొసైటీల నుంచి ప్రతి నెలా వాయిదాల కింద రూ.60 వేలు డీసీసీబీ వసూలు చేసి నాబార్డుకు చెల్లించాలి. గోదాములు వినియోగంలోకి రాక, వాటిపై ఆదాయం లేక సొసైటీలు రుణ వాయిదాలు చెల్లించలేకపోతున్నాయి. వీటికి ప్రభుత్వం హామీ ఇచ్చినా ప్రస్తుతం రుణ వాయిదాలు వసూలు కావడం లేదు.

ఊరికి దూరం.. ఆపై నాణ్యత లోపం

గోదాములను ఊరికి దూరంగా నిర్మించారు. ఆపై లోతట్టు ప్రాంతాలు ఎంపిక చేశారు. ఈ పనులు దక్కించుకున్న గుత్తేదారులు నాణ్యతకు పాతరేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పైగా పర్యవేక్షణ కొరవడింది. మంజూరైన వాటిలో విజయనగరం జిల్లాలో 23, మన్యం జిల్లాలో ఆరు పూర్తి చేశారు. వీటిని సొసైటీలకు అప్పగించారు. విజయనగరం జిల్లాలో వెయ్యి టన్నుల సామర్థ్యంతో వేపాడ, తమ్మాపురం, గుషినిలో గోదాములు నిర్మాణంలో ఉన్నాయి.

కలెక్టర్ ఆదేశించినా..

గోదాముల ప్రగతిపై విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జులై 26న సమీక్షించారు. నిర్మాణం పూర్తయిన వాటిని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ ప్రక్రియను రెండు వారాల్లో పూర్తి చేయాలని అప్పటి జేసీ కార్తీక్‌ను ఆదేశించారు. ఇంతలో ఆయన బదిలీ అయ్యారు. నిర్మాణంలో ఉన్న వాటిని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పెండింగ్ బిల్లుల మంజూరుకు ఆమోదం తెలిపారు. ఇప్పటి వరకు గోదాముల వినియోగానికి సంబంధించి ఎటువంటి పురోగతి లేదు. ప్రభుత్వం హామీ ఇచ్చినా రుణ వాయిదాలు వసూలు చేసి నాబార్డుకు చెల్లించాల్సి ఉన్నందున సంబంధిత అధికారులు సొసైటీల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. రుణాల వసూళ్లకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారని డీసీసీబీ సీఈవో ఉమామహేశ్వరరావు 'ఈనాడు'కు తెలిపారు. గోదాముల నిర్మాణ పనులు మార్కెటింగ్ శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. విజయనగరం జిల్లాలో 15 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, ఒకటి న్యాయస్థానంలో కేసు కారణంగా ఆగిపోయిందని జిల్లా మార్కెటింగ్ శాఖ డీఈ రవికిరణ్ తెలిపారు. మన్యం జిల్లాలో ఆరు నిర్మాణాలు పూర్తయ్యాయి. తొమ్మిది చివరి దశ బిల్లుల చెల్లింపునకు ఎదురుచూస్తున్నాయి. అయిదు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయి. పూర్తయిన ఆరు సొసైటీలకు అప్పగించామని శ్రీకాకుళం జిల్లా మార్కెటింగ్ శాఖ డీఈ కోటయ్య 'ఈనాడు'కు వివరించారు.

నాణ్యత లేని శనగపప్పు

ప్రసాదాల తయారీ కేంద్రంలో తనిఖీలు


పరిశీలిస్తున్న సహాయ సంచాలకురాలు ఈశ్వరి

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: విజయనగరంలోని పైడితల్లి ఆలయానికి సంబంధించిన ప్రసాదాలు అమ్మవారి కల్యాణ మండపంలో తయారు చేస్తుంటారు. ఈ కేంద్రాన్ని బుధవారం ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు తనిఖీ చేశారు. లడ్డూ, అందులో వాడుతున్న నెయ్యి, ఇతర పదార్థాలను పరిశీలించారు. లడ్డూలో వాడుతున్న శనగపప్పు నాణ్యతగా లేకపోవడాన్ని గుర్తించారు. ఆ పప్పును సరఫరా చేసిన గుత్తేదారుడిని పిలిచి సరకు మొత్తం వెనక్కి తీసుకోవాలని ఆదేశించినట్లు జిల్లా సహాయ సంచాలకులు ఈశ్వరి, నాగుల్ మీరా తెలిపారు. కొన్నింటి నమూనాలు సేకరించి, ల్యాబ్‌కు తరలించామని చెప్పారు.

చంద్రబాబుతో కర్రోతు


సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో బంగార్రాజు

భోగాపురం, న్యూస్‌టుడే: తొలివిడతలో నామినేటెడ్ పదవులు వరించిన నాయకులతో బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు ముఖ్యమంత్రిని కలిశారు. తొలివిడత 20 మందిలో బంగార్రాజు పేరును ప్రకటించడంతో జిల్లాలోని కూటమి నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

27న ఆడలి వ్యూ పాయింట్ ప్రారంభం

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం అట్టహాసంగా నిర్వహిస్తామని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఆడలి వ్యూ పాయింట్, రెస్టారెంట్, నైట్ క్యాంపింగ్ టెంట్లు ప్రారంభిస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు ఎన్టీఆర్ ఉద్యానవనంలో 'ఐ లవ్' సీతంపేట పేరుతో ఫొటో పాయింట్, 5 డీ థియేటర్ ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమానికి మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే జయకృష్ణ, ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని పీవో తెలిపారు. సీతంపేట పార్కు అభివృద్ధికి రూ.1.50 కోట్లు ముఖ్యమంత్రి మంజూరు చేశారని, దీంతో మరిన్ని పర్యాటక పనులు చేపట్టడానికి వీలు కలుగుతుందన్నారు. అనంతరం వ్యూ పాయింట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏపీవో .జి.చినబాబు, డీపీవో వై.సతీష్ కుమార్ పాల్గొన్నారు.


రమ్మంటున్నారు.. వాల్మీకి

● రామనారాయణంలో రామాయణ పరిశోధన కేంద్రం
● నేడు ప్రారంభించనున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


పరిశోధన కేంద్రం

సర్వజనీకం.. సర్వకాలీకం సూత్రాన్ని పాటిస్తూ భావితరాలకు రామాయణాన్ని జీవన మార్గంగా.. జీవిత లక్ష్యంగా.. మార్గదర్శకంగా మార్చడమే ధ్యేయంగా నిర్మితమైంది విజయనగరంలోని రామనారాయణం. 15 ఎకరాల సువిశాల స్థలంలో కోదండం ఆకృతిలో ఆకట్టుకునే ఈ ఆలయం దేశ ప్రఖ్యాతి గాంచింది. విజయనగరం జిల్లా కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఎన్‌సీఎస్ ఛారిటబుల్ ట్రస్టు దీనిని తీర్చిదిద్దింది. ఇప్పటికే రామాయణంలోని వివిధ ఘట్టాలను 72 శిలారూపాలతో ఆవిష్కరించారు. ఆలోచింపజేసే నిర్మాణాలు, విగ్రహాలు దర్శనమిస్తాయి. కొత్తగా వాల్మీకి రామాయణ పరిశోధన కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. దీన్ని గురువారం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభించనున్నారు. ఈ కేంద్రాన్ని జాతికి అంకితం చేయనున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు.

విజయనగరంలోని రామనారాయణం



కొలువుదీరనున్న వాల్మీకి మహర్షి విగ్రహం

12 వేల గ్రంథాలు, పుస్తకాలు..

రామాయణాన్ని నేటి సమాజానికి పరిచయం చేస్తూనే.. భారతావనిని రామరాజ్యం వైపు తీసుకువెళ్లడమే వాల్మీకి పరిశోధన కేంద్రం ప్రధాన లక్ష్యం. ఇక్కడ 12 వేల గ్రంథాలు, పుస్తకాలు అందుబాటులో ఉంచనున్నారు. భవిష్యత్తులో ఆ సంఖ్యను లక్షకు పెంచుతారు. చదవడానికి పుస్తకాలతో పాటు కంప్యూటర్లలోనూ నిక్షిప్తం చేస్తారు. సంస్కృతం, తెలుగు, హిందీ, ఆంగ్లంతో పాటు ఇతర ప్రముఖ భాషల్లో అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు, యువత, ఆధ్యాత్మికవేత్తలు, పండితులు, ప్రవచనకర్తలు, గురూజీలు నిరంతరం అధ్యయనం చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని ధర్మకర్తలు నారాయణం నాగేశ్వరరావు, శ్రీనివాస్ తెలిపారు. పీహెచ్‌డీలు చేసే వారికి ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడనుందన్నారు. గురువారం ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం శ్రీరామాయణ శంఖారావం పేరిట మూడు రోజుల పాటు వాల్మీకి రామాయణంపై మహా సదస్సు నిర్వహిస్తారు.

– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

అహో.. అంగన్‌వాడీ

తాగునీరు, మరుగుదొడ్లకు నిధులు

న్యూస్‌టుడే-రాజాం: అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. ఏళ్లుగా ఈ కేంద్రాల్లో మౌలిక వసతులు లేక బాలలు, బాలింతలు, గర్భిణులు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. ప్రభుత్వం ప్రాజెక్టుల వారీగా కేంద్రాల్లో సమస్యలను గుర్తించి నిధులను మంజూరు చేసింది. పనులు పూర్తి చేసే బాధ్యతను గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)కు అప్పగించింది.

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.448.64 లక్షలతో 1,736 పనులు చేపట్టనున్నారు. 808 మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.290.88 లక్షలు, 928 తాగునీటి సౌకర్యం పనులకు రూ.157.76 లక్షలు వెచ్చిస్తారు. కేంద్రాలకు పక్కా భవనాలున్న చోట్ల ఈ వసతులు అందుబాటులోకి తెస్తారు.

రెండు జిల్లాల్లో ఇలా..

జిల్లా	మరుగుదొడ్ల పనులు	నిధులు (రూ.లక్షల్లో)	తాగునీటి సౌకర్యం పనులు	నిధులు (రూ.లక్షల్లో)
విజయనగరం	339	122.04	416	70.72
మన్యం	469	168.84	512	87.04


అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు

వేగవంతం

నిధులు మంజూరు కావడంతో పనులను త్వరితగతిన చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఒక్కో కేంద్రంలో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36 వేలు, తాగునీటి సౌకర్యానికి రూ.17 వేల చొప్పున వెచ్చిస్తారు. పిల్లలకు అనువుగా ఉండేలా రెండేసి చొప్పున గదులు నిర్మించాలి. మూత్రశాలలు, మరుగుదొడ్లు బేసిన్లు వేర్వేరుగా ఏర్పాటు చేస్తారు. వైకాపా ప్రభుత్వం నాడు-నేడులో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు నిర్మిస్తున్నట్లు గొప్పలు చెప్పినా.. సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడంతో ఎక్కడికక్కడ అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

ఉపయోగం

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు అందుబాటులోకి వస్తుండడం ముదావహం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో కీలకమైన మరుగుదొడ్లు, తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది. చిన్నారులు, మహిళలకు సమస్యలు తప్పుతాయి. ఈ పనులను వీలైనంత వేగంగా పూర్తి చేయించేలా కృషి చేస్తాం.

-శాంతకుమారి, పీడీ, ఐసీడీఎస్

కలకలం

16 మంది వసతి గృహం విద్యార్థినులకు అతిసారం


ప్రాంతీయాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: శృంగవరపుకోటలోని పందిరప్పన్న కూడలిలో ఉన్న ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహానికి చెందిన 16 మంది విద్యార్థినులు అతిసారం బారినపడటం కలకలం రేపింది. ఆదివారం ఇద్దరు, మంగళవారం ఎనిమిది మంది, బుధవారం ఆరుగురు వాంతులు, విరోచనాలతో బాధపడగా వైద్యులు పరీక్షించి అతిసారంగా నిర్ధారించారు. ఇందులో ఇద్దరు విజయనగరం మహారాజా ఆసుపత్రిలో.. పది మంది ఎస్.కోట ప్రాంతీయాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నలుగురి పరిస్థితి మెరుగుపడటంతో ఇంటికి పంపారు. సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామానందం బుధవారం ఎస్ కోట ఆసుపత్రికి వచ్చి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. వసతి గృహంలోని ఆహారం, నీరు కలుషితమైతే అందరూ వ్యాధి బారిన పడేవారని, బయట ఆహారం తీసుకోవడమే అస్వస్థతకు కారణమన్నారు. ఇంతమంది ఒకేసారి బయట ఆహారం ఎలా తిన్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైద్యులు కూడా స్పష్టంగా ఏ విషయం చెప్పడం లేదని, మంచినీటి నమూనాలు పరీక్షకు పంపినట్లు చెబుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే లలితకుమారి విద్యార్థులను పరామర్శించి, వైద్యులతో మాట్లాడారు. అనంతరం వసతిగృహాన్ని సందర్శించారు. ఆహారంలో నాణ్యత లోపిస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ విషయమై మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పందించారు. విద్యార్థినులు వరుసగా ఆసుపత్రుల్లో చేరిన విషయం తెలుసుకోవాలని కలెక్టర్, డీఎంహెచ్‌వోలను ఆదేశించారు.

రూ.కోటి సిమెంటు పక్కదారి

సర్వసభ్య సమావేశంలో సభ్యుల గగ్గోలు



వివరాలు తెలుసుకుంటున్న జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు

వేపాడ, న్యూస్‌టుడే: వేపాడ మండలంలో గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సంబంధించి రూ.కోటి విలువైన సిమెంటు పక్కదారి పట్టినట్లు బుధవారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో సభ్యులంతా గగ్గోలు పెట్టారు. సరఫరా చేయకుండానే బిల్లుల్లో కోత విధించారంటూ దబ్బిరాజుపేట, ముకుందపురం, బానాది తదితర పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరైన జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు స్పందించి.. జిల్లా అధికారులతో చరవాణిలో మాట్లాడారు. సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సేవా కేంద్రాల్లో సరఫరా చేసిన వరి విత్తనాల్లో కేళీలు వచ్చాయని సోంపురం ఎంపీటీసీ సభ్యుడు సత్యన్నారాయణ అన్నారు. ఎరువుల సరఫరా సకాలంలో జరగడంలేదని, ప్రైవేటు వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నా చర్యలు లేవంటూ జడ్పీటీసీ సభ్యుడు అప్పలనాయుడు ఆరోపించారు.

కళా ప్రదర్శనలకు ఆహ్వానం

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా నగరంలోని ఆనంద గజపతి కళాక్షేత్రంలో అక్టోబరు 13, 14వ తేదీల్లో నిర్వహించనున్న కళా ప్రదర్శనల్లో పాల్గొనాలనుకునేవారు ఈనెల 28 లోగా మహారాజా సంగీత నృత్య కళాశాలలో వివరాలు అందజేయాలని వేదిక ఇన్‌ఛార్జి ఎస్.ఉమాశంకర్ తెలిపారు. గడువు ముగిసిన తరువాత దరఖాస్తులు స్వీకరించమన్నారు. క్లాసికల్, సెమీ క్లాసికల్, భక్తి సంగీతం తదితర బృంద నృత్యాలకు మాత్రమే అవకాశం ఉందని, ఒక్కో ప్రదర్శనకు 15 నిమిషాలు కేటాయిస్తామన్నారు.

మహాసభల విజయవంతానికి పిలుపు



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని ఫూల్‌బాగ్ జగన్నాథ కల్యాణ మండలంలో అక్టోబరు 6, 7, 8వ తేదీల్లో జరగనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు పిలుపునిచ్చారు. సంఘం కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. విద్యా ప్రగతి, ఉపాధ్యాయుల సంక్షేమం, సమాజశ్రేయస్సు, మహిళాసాధికారత, నూతన విద్యా విధానంపై చర్చించి తీర్మానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిస్తామన్నారు. అనంతరం సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు, ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.బలరామ్‌నాయుడు, ఎన్.వి.పైడిరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెస్తాం



విద్యాసాగర్‌ను సత్కరిస్తున్న నాయకులు

మయూరి కూడలి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు ఎం.విద్యాసాగర్ అన్నారు. బుధవారం విజయనగరంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలకు ముందుంటామన్నారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు రమేష్ కుమార్, సతీష్ కుమార్, తిరుపతి, ఎ.కరీమ్, శ్రీనివాసరావు తదితరులు ఆయనను సత్కరించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	118	206	216

ఆ అయిదింట్లో.. నగదు రహితం

- జనవరి నుంచి ప్రయోగాత్మకంగా అమల్లోకి
- దశలవారీగా మిగిలిన గ్రామాల్లో విస్తరణ

న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

ఏదైనా ఒక కార్యక్రమం అమలు చేసే ముందు పక్కా ప్రణాళిక ఉండాలి. ఇదేదీ లేకుండా ఉపక్రమిస్తే ఆచరణలో విఫలమయ్యే అవకాశం ఎక్కువ. గత ప్రభుత్వం పంచాయతీల్లో అమలు చేసిన నగదు రహిత లావాదేవీలే ఇందుకు నిదర్శనం. పంచాయతీలు బ్యాంకు ఖాతాలు ప్రారంభించినా, లావాదేవీలకు అవసరమైన క్యూఆర్ కోడ్.. ఈ-పోస్ యంత్రాలు అందుబాటులోకి వచ్చే సరికి జాప్యం చోటుచేసుకుంది. సాంకేతిక సమస్యలు వెంటాడడంతో అమలు పడకేసింది. దీనిని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం దశలవారీగా చేపట్టాలని నిర్ణయించింది.



ఎంపికైనవి ఇవే..

మండలం	పంచాయతీ
బొబ్బిలి	పిరిడి
గంట్యాడ	కొర్లాం
చీపురుపల్లి	నిమ్మలవలస
పార్వతీపురం	పులిగుమ్మి
కురుపాం	గుమ్మ

తొలుత ఇలా..

2025 జనవరి నుంచి నగదు రహిత లావాదేవీలను నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. పన్నులు, పన్నేతర ఆదాయం పక్కదారి పట్టకుండా ఉండాలన్నది ఈ విధానం ప్రధాన ఉద్దేశం. ఉమ్మడి జిల్లాలో 1228 పంచాయతీలుండగా.. 5 చోట్ల ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నారు. డెబిట్, క్రెడిట్ కార్డు లేదా క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకోనున్నారు. గ్రామాలకు సంబంధించిన పన్ను, పన్నేతర ఆదాయం వివరాలు త్వరలో పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ద్వారా ఆధారంగా తెలుసుకుని నగదు కట్టాలి. గిరిజన ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలున్న చోట కొన్నేళ్ల పాటు నగదు వసూళ్లనే కొనసాగించే అవకాశముందని పేర్కొంటున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో విజయనగరం జిల్లాకు పన్ను, పన్నేతర ఆదాయం కలిపి రూ.23.47 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా విధించారు.

గత ప్రభుత్వంలో..

కేంద్రం ఆదేశాలతో గత ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇంటిపన్ను, సర్‌ఛార్జీలు, రోజు వారీ మార్కెట్ వసూళ్లు ఇలా.. పంచాయతీకి డబ్బు చెల్లించాలంటే నగదు రహిత విధానంలోనే కట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఆన్‌లైన్ విధానంలో నగదు చెల్లింపులు, నెట్ బ్యాంకింగ్ విధానం, కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పీఓఎస్ యంత్రాల్లో డెబిట్ కార్డులు, ఫోన్‌పే, పేటీఎం, చరవాణిలో క్యూఆర్ కోడ్ స్కాన్ వంటి విధానాల్లో చెల్లింపులు చేయాలి. పంచాయతీలు బ్యాంకు ఖాతాలు ప్రారంభించినా.. లావాదేవీలకు అవసరమైన బ్యాంకు క్యూఆర్ కోడ్.. ఈ-పోస్ యంత్రాలు అందుబాటులోకి వచ్చేసరికి ఆలస్యమైంది. ఈక్రమంలో సిబ్బంది కొందరి నుంచి నగదు, ఇంకొందరి నుంచి ఆన్‌లైన్ విధానంలో వసూలు చేపట్టారు. ఆన్‌లైన్‌లో జమైన సొమ్ము పంచాయతీ ఖాతాలకు రాకపోవడం, సర్వీసు ఛార్జీల్లో కోతపడడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇక నుంచి ఆ పరిస్థితి లేకుండా చూడనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారులు తెలిపారు.

బొజ్జగణపయ్యా వెళ్లిరావయ్యా

మండపాల్లో మూడు వారాల పాటు కొలువుదీరిన గణనాథుడు బుధవారం గంగమ్మ తల్లి ఒడిలో చేరాడు. విజయనగరం జిల్లా కేంద్రంలో అనుపోత్సవాలు సందడిగా జరిగాయి. పెద్దఎత్తున భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. యువత నృత్యాలతో సందడి చేసింది. స్థానిక రంగాలవీధిలో నిర్వహించిన ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం



ఊరేగింపులో వినాయక విగ్రహం



వేదికపై కళాకారుల విన్యాసాలు



వేషధారణలో భక్తుడు

ఎన్ఎంఎంఎస్‌కు గడువు పొడిగింపు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఎన్ఎంఎంఎస్ (జాతీయ ప్రతిభ ఉపకార వేతన పరీక్ష)కు దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబరు 3 వరకు గడువు పెంచినట్లు డీఈవో ప్రేమకుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు చూడాలని పేర్కొన్నారు.

విషాదం మిగిల్చిన విహారం

స్నేహితుల కళ్లెదుటే గల్లంతై యువకుడి మృతి



పవన్ (పాతచిత్రం)

గంట్యాడ, గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు వారివి.. ఒక్కరోజు పని మానేస్తే పూట గడవని పరిస్థితి.. ఎన్ని అడ్డంకులున్నా కుమారుడ్ని మాత్రం చదివించి ప్రయోజకుడిని చేయాలని ఆశపడ్డారు.. చివరికి చెట్టంత కొడుకును గెడ్డ మింగేయడంతో కన్నీరుమున్నీరయ్యారు. మిత్రులతో కలిసి సరదాగా వాగులోకి దిగిన యువకుడు గల్లంతై ప్రాణాలు కోల్పోయిన ఘటన గంట్యాడ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికృష్ణ వివరాల మేరకు.. గంట్యాడ గ్రామానికి చెందిన ఆర్.పవన్(17) స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులు పళ్ల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. బుధవారం పవన్ తన ముగ్గురు స్నేహితులతో కలిసి బుడతనాపల్లికి వెళ్లాడు. అక్కడ వీరికి మరో ముగ్గురు తోడయ్యారు. అంతా కలిసి గ్రామంలోని తమురు గెడ్డ వద్దకు వెళ్లి, సరదాగా నీటిలో కేరింతలు కొడుతుండగా పవన్ నాచులో జారిపోవడంతో మునిగిపోయాడు. మిగిలిన వారు కేకలు వేయడంతో స్థానికులు చేరుకుని వెతికారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై సాయికృష్ణ గజ ఈతగాళ్లతో గాలించగా సాయంత్రం మృతదేహం లభ్యమైంది. విద్యార్థి తండ్రి అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



అవతారం (పాతచిత్రం)

గంట్యాడ, గ్రామీణం, న్యూస్‌టుడే: చదువు ఉద్యోగం ఇవ్వలేదు.. సొంత కాళ్లపై బతకాలని చేసిన ప్రయత్నం ఫలించలేదు. . తీసుకున్న అప్పులు తిరిగి ఎలా చెల్లించాలో తెలియక మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గంట్యాడ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికృష్ణ వివరాల మేరకు.. పెదవేమలికి చెందిన వి.అవతారం(27) డిగ్రీ పూర్తి చేసి, ఉద్యోగం కోసం ప్రయత్నించినా ఫలించలేదు. అయినా నిరాశ చెందకుండా కొన్నేళ్ల క్రితం విజయనగరంలో సొంతంగా క్యాటరింగ్ వ్యాపారం ప్రారంభించి, నలుగురికి ఉపాధి కల్పించాడు. ఆపై అప్పులు చేసి, వ్యాపారాన్ని పెంచాడు. నష్టం రావడం, అప్పులు తీసుకున్న వారి ఒత్తిడి చేయడంతో మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం లక్కిడాం గ్రామానికి వెళ్లి స్నేహితుడి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పంకాకు ఉరేసుకున్నాడు. ఆయనకు తల్లిదండ్రులు, సోదరుడు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బొగ్గులో కూరుకుపోయి మతిస్థిమితం లేని వ్యక్తి మృత్యువాత

కొత్తవలస, న్యూస్‌టుడే: కంటకాపల్లిలోని ఓ పరిశ్రమ బొగ్గుయార్డులో మృతదేహంగా మారిన వ్యక్తి ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. ఈ కేసు వివరాలను సీఐ షణ్ముఖరావు బుధవారం వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం బలిచంద్రపూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని సొడియా గ్రామానికి చెందిన సంబునాథ్ పరిడియా(40) ఈనెల 22న యార్డులో ఉన్న బొగ్గులో కూరుకుపోయి కనిపించాడు. అప్పటికే మృతిచెందడంతో పరిశ్రమ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. కటక్ నుంచి ఆరు లారీల్లో పరిశ్రమకు బొగ్గు వచ్చినట్లు తేలడంతో.. అక్కడి యార్డు వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. సంబునాథ్ ఓ లారీలోకి సంచి పట్టుకొని ఎక్కి కూర్చొని, చెయ్యి ఊపుతూ, నమస్కరించిన దృశ్యాలు కనిపించాయి. మతిస్థిమితం లేక ఎక్కాడని, గమనించకుండా బొగ్గు లోడింగ్ చేయడంతో మరణించి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహం వద్ద బాధచ్నానా సీహెచ్‌సీ ఓపీ చీటీ లభ్యమవడంతో.. బంధువులకు సమాచారం ఇచ్చారు. అతడి తల్లి రుక్మిణి, సోదరి రుస్మిత, బంధువు సురేంద్ర రికార్డయిన దృశ్యాలను చూసి. . సంబునాథ్‌గా నిర్ధారించారు. ఎస్.కోట ప్రాంతీయాసుపత్రికి వచ్చి మృతదేహాన్ని గుర్తు పట్టారని సీఐ వివరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని మినీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై అనీష్ వివరాల ప్రకారం.. పెదకుదమకు చెందిన కె.కృష్ణ(50) వ్యవసాయ కూలీ. బుధవారం ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా.. జోగులడుమ్మ నుంచి బొమ్మిక వైపు వెళ్తున్న మినీ వ్యాన్ ఢీకొట్టింది. ఆయన బలంగా కిందపడడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. కృష్ణకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఇద్దరికీ వివాహాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోక్సో కేసు నమోదు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణమూర్తి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన జి.హేమంత్ ఓ బాలికను ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. తీరా పెళ్లి చేసుకోమని అడగ్గా.. అతనితో పాటు కుటుంబ సభ్యులు కులం పేరుతో దూషించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సోతో పాటు అట్రాసిటీ కేసులు నమోదు చేశామని సీఐ చెప్పారు.

రెండో భార్యను కలవొద్దన్నందుకు చంపేశాడు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు మండలంలో ఇటీవల జరిగిన మహిళ అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. కట్టుకున్న భర్తే కడతేర్చాడని నిర్ధారించారు. సీఐ రామకృష్ణ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కురాసువలసలో నివాసముంటున్న బి.శ్రీను 15 ఏళ్ల కిందట కరాసమ్మ(39)ను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. మరోవైపు 12 ఏళ్ల క్రితం కొత్తవలస గ్రామానికి చెందిన మరో యువతిని రాము పెళ్లి చేసుకున్నాడు. ఈమె కొన్నిరోజుల క్రితం కరాసువలసలోని ఓ ఇంట్లో దిగారు. తరచూ అక్కడికి వెళ్తున్నాడని, రెండో భార్యను కలవొద్దంటూ కరాసమ్మ భర్తతో గొడవపడింది. ఈక్రమంలో ఈనెల 20న ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీను ఆమె మెడకు చున్నీ కట్టి గొంతు నులిమి చంపేశాడు. కొంతసేపటి తరువాత స్థానికులు వెళ్లి చూడగా.. విగతజీవిగా కనిపించింది. వెంటనే సాలూరు సామాజిక ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అనుమానాస్పదమృతిగా కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడు లొంగిపోయి, నేరాన్ని ఒప్పుకొన్నాడని, కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం

తెర్లాం, న్యూస్‌టుడే: విద్యుత్తు తీగలు తగిలి రైతు మృతిచెందిన ఘటన తెర్లాం మండలంలో చోటుచేసుకుంది. అంట్లవారకు చెందిన కె.రామారావు(48) బుధవారం సాయంత్రం పొలం వైపు వెళ్లాడు. పంపుసెట్లకు సంబంధించిన తీగ తెగిపడిన విషయాన్ని గమనించకుండా నడవడంతో విద్యుదాఘాతానికి గురై మరణించాడు. ఆయనకు భార్య చిన్నమ్మి, ముగ్గురు కుమారులున్నారు. ఇంటి పెద్దను కోల్పోవడంతో ఇక తమకు దిక్కెవరని భార్య రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. సమాచారం తెలుసుకున్న ఏఈ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సర్వీసు వైరు తెగి పడి ఉందని ఏఈ చెప్పారు. వివరాలు సేకరిస్తున్నామని ఎస్సై సాగర్‌బాబు తెలిపారు.

జిల్లా జట్ల ఎంపికలకు షెడ్యూల్ విడుదల

విజయనగరం క్రీడలు, కొత్తవలస: స్కూల్‌గేమ్స్ అండర్- 14, 17 ఉమ్మడి జిల్లాల జట్ల ఎంపికలకు సంబంధించిన తేదీల షెడ్యూల్‌ను ఆ విభాగం కార్యదర్శి కె.కృష్ణంరాజు బుధవారం సాయంత్రం విడుదల చేశారు. క్రీడాకారులు ఆయా తేదీల్లో హాజరు కావాలని, ముందుగా పాఠశాలల నుంచి అనుమతి పత్రాలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

తేదీ	అంశం	విభాగం	ఎంపిక ప్రదేశం
27	క్రికెట్	అండర్-14(బాలురు)	విజ్జీ మైదానం
27	టేబుల్‌టెన్నిస్	14, 17(బాల,బాలికలు)	పువ్వాడ స్కూల్, విజయనగరం
28	క్రికెట్	17(బాల, బాలికలు)	విజ్జీ మైదానం
28	సెపక్‌తక్రా	14, 17(బాల, బాలికలు)	జడ్పీ పాఠశాల వీటీ అగ్రహారం
28	సైక్లింగ్	14, 17(బాలురు)	విజ్జీ మైదానం
28	రగ్బీ	14, 17(బాలురు)	జడ్పీ పాఠశాల, గరుడుబిల్లి
28	బాస్కెట్‌బాల్	14, 17(బాలురు)	జిందాల్ భారతి, కొత్తవలస
28	అథ్లెటిక్స్	17(బాల, బాలికలు)	విజ్జీ మైదానం
30	బేస్‌బాల్	14, 17(బాల, బాలికలు)	జడ్పీ పాఠశాల, బాడంగి
అక్టోబర్			
1న	బాల్ బ్యాడ్మింటన్	14, 17(బాల, బాలికలు)	జడ్పీ పాఠశాల, ఎస్.కోట
1	ఫెన్సింగ్	14, 17(బాల, బాలికలు)	విజ్జీ మైదానం
1	స్విమ్మింగ్	14, 17(బాల, బాలికలు)	ప్రభుత్వ ఈత కొలను

అంతర్రాష్ట్ర నేరస్థుడి అరెస్టు

రాజమహేంద్రవరం నేరవార్తలు: ఒకటి కాదు.. రెండుకాదు.. ఏకంగా 44 కేసుల్లో నిందితుడు.. 14 కేసుల్లో జైలుకు వెళ్లాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జైలు నుంచి విడుదలయ్యాడు. మళ్లీ భారీ చోరీ చేసి ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. ఎస్పీ డి.నరసింహకిశోర్ వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా జగన్నాథపురం ఏటిమొగకి చెందిన పి.రవిశంకర్ అలియాస్ వీరబాబు రాజమహేంద్రవరం ఏవీఏ రోడ్డులోని కోటబాస్కరమ్మనగర్‌లో నివాసముంటున్నాడు. పశ్చిమగోదావరి, విశాఖ, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో నేరాలకు పాల్పడ్డాడు. గత నెల 26 రాత్రి కొవ్వూరు పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకు వీధిలోని ఓ అపార్టుమెంట్లోకి చొరబడి సుమారు 400 గ్రాముల బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనం ఎత్తుకెళ్లాడు. కేసు నమోదు చేసిన సీఐలు విశ్వం, విజయ్‌బాబు, ఎస్సైలు రవీంద్రబాబు, జగన్మోహనరావు రెండు బృందాలుగా దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో ఇటీవల కొవ్వూరు పట్టణంలోని నిడదవోలు బస్టాపులో నిందితుడు, అతడికి సహకరించిన ఎల్.నాగరాజును అరెస్టు చేశారు. చోరీ సొత్తును భీమవరంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ నుంచి రికవరీ చేశారు. 400 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు ద్విచక్రవాహనాన్ని రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

స్థానిక సంస్థల్లో కొలిక్కిరాని బదిలీలు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా కేంద్రంగా జరుగుతున్న బదిలీల ప్రక్రియ స్థానిక సంస్థల్లో ఇంకా కొనసాగుతోంది. సోమవారం నాటికే ఉత్తర్వులు ఇస్తామని ప్రకటించిన అధికారులు బుధవారానికి కూడా అందించకపోవడంతో ఉద్యోగులంతా ఎదురుచూస్తున్నారు. జడ్పీ పరిధిలో సబార్డినేట్లు, జూనియర్ సహాయకులు, టైపిస్ట్ క్యాడర్లకే పత్రాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. సీనియర్ సహాయకులు, సూపరింటెండెంట్లు, ఎంపీడీవో క్యాడర్లలో ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. జడ్పీలో 846 మంది వివిధ కేడర్లలో పనిచేస్తున్నారు. వీరిలో అయిదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారు 235 మంది ఉన్నారు. వీరు కాకుండా రిక్వెస్ట్ అంశం కింద కొందరు దరఖాస్తులు చేశారు. వీరితో పాటు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌లో మినిస్టీరియల్ సిబ్బందికి స్థానచలనం కల్పించాల్సి ఉంది. మరికొన్ని గంట్లోనే ప్రక్రియ పూర్తిచేస్తామని జడ్పీ ఇన్‌ఛార్జి సీఈవో శ్రీధర్ రాజా 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

అక్టోబరు 2 వరకు ఆగాల్సిందే..

సచివాలయ ఉద్యోగులకు సంబంధితశాఖల వారీగా ప్రక్రియ పూర్తి చేశారు. ఉత్తర్వులను మండల కేంద్రాలకు పంపినట్లు అధికారులు పేర్కొంటున్నారు. తొలుత వీరిని ఈనెల 26 వరకూ రిలీవ్ చేయొద్దని ప్రభుత్వం ఆదేశించింది. అక్టోబరు ఒకటో తేదీన ఫించన్ల పంపిణీని దృష్టిలో ఉంచుకుని 2 వరకు రిలీవ్ చేయొద్దని ఆదేశాలు వెలువడినట్లు జిల్లా సచివాలయ అధికారిణి నిర్మలాదేవి తెలిపారు.

కొత్త సూపరింటెండెంట్లు..

నేరవార్తా విభాగం: సెబ్ నుంచి అబ్కారీ శాఖను తప్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నాక ఆయా విభాగాలకు అధికారులను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం సూపరింటెండెంటుగా శ్రీనాథుడు, పార్వతీపురం మన్యం జిల్లాకు జయసింహ చౌదరిని నియమించారు. రెండు జిల్లాలకు సంబంధించి ఎన్.వీ.రమణకు డిపో మేనేజర్ బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం గుంటూరులో డీసీ(డిప్యూటీ కమిషనర్)గా పనిచేస్తున్న ఎస్‌వీవీఎన్.బాబ్జీరావు బదిలీపై విజయనగరం డీసీగా వస్తున్నారు.

విజయనగరం కంటోన్మెంట్: దేవాదాయశాఖ పార్వతీపురం మన్యం జిల్లా అధికారిణి కె.ఎల్.సుధారాణి అనకాపల్లి జిల్లాకు వెళ్లనున్నారు. అక్కడ పనిచేస్తున్న రాజారావు ఆమె స్థానంలో వస్తున్నారు. విశాఖ జిల్లా సహాయ కమిషనర్‌గా ఉన్న కె.శిరీష విజయనగరం ఏసీగా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఆర్అండ్‌బీ ఈఈ బాధ్యతల స్వీకరణ



విజయనగరం కోట: విజయనగరం డివిజన్ రహదారులు, భవనాల శాఖ ఈఈగా ఎం.జేమ్స్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం డివిజన్ నుంచి వచ్చారు. ఇక్కడ ఈఈగా పనిచేసిన రమణ ఉద్యోగ విరమణ పొందారు.



ఎస్ఈ లక్ష్మణరావుకు సమస్యలు వివరిస్తున్న యూనియన్ నాయకులు

విద్యుత్తు ఉద్యోగుల ఆందోళన

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: బదిలీల్లో నిబంధనలు పాటించలేదని ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగులు మంగళవారం రాత్రి విజయనగరంలోని ఎస్ఈ ఎం.లక్ష్మణరావు కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. సీనియర్లను కాదని జూనియర్లకు స్థానచలనం కల్పించారని ఆరోపించారు. దీంతో చాలా మంది నష్టపోయారని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ(ఏపీ ఈఈ) ఎంప్లాయీస్ యూనియన్-1104 నాయకులు నినాదాలు చేశారు. అవకతవకలను సరిచేస్తామని ఎస్ఈ చెప్పడంతో వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని, ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు యూనియన్ జిల్లా రీజనల్ కార్యదర్శి ఎస్.లక్ష్మణ్ పేర్కొన్నారు.

బాధితులకు రూ.లక్ష విరాళం

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరానికి చెందిన గూడెంవీధి పెద్ద డి.భానుప్రసాద్, స్థానిక యువత విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచారు. వారికి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. బుధవారం పార్వతీపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విజయచంద్రకు నగదును అందజేశారు.



హోంగార్డుల కుటుంబాలకు అండగా ఉంటాం

నేరవార్తావిభాగం: పోలీసు శాఖలో హోంగార్డుగా పనిచేసిన జి.వెంకట సత్యం ఈనెల 10న విద్యుత్తు ప్రమాదంలో మరణించారు. ఈ సందర్భంగా యాక్సిస్ బ్యాంకు శ్యాలరీ ప్యాకేజీ స్కీమ్‌లో భాగంగా మంజూరైన రూ.38 లక్షల చెక్కు, పోలీసు కార్యాలయం తరఫున వెల్ఫేర్, ఎక్స్‌గ్రేషియా, చేయూతగా రూ.4,20,500 చెక్కును బాధిత కుటుంబానికి బుధవారం తన కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంగార్డుల జీతాలను యాక్సిస్ బ్యాంకులో జమయ్యేలా చూస్తున్నామని, ఎవరైనా మరణిస్తే ప్రత్యేక పథకం కింద నగదు వస్తుందని చెప్పారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, బ్యాంక్ మేనేజర్ విశ్వకల్యాణ్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న వకుల్ జిందాల్

పరిహారం పెంచాలని విన్నపం


మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

రామభద్రపురం, న్యూస్‌టుడే: రహదారి విస్తరణలో భాగంగా తారాపురంలోని కొన్ని ఇళ్లలోని భాగాన్ని తొలగించడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు సులోచనారాణి పరిహారం పంపిణీకి బుధవారం గ్రామసభను నిర్వహించారు. ప్రజలకు ఇచ్చే పరిహారం చాలదని, దాన్ని పెంచి, ఇళ్ల స్థలాలతోపాటు కట్టించి ఇవ్వాలని సర్పంచి బి.రమణమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు బి.సునీత, పెద్దలు సీతారామ్, చిన్నారావు అన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీవో తెలిపారు. డీటీ పద్మ, వీఆర్వో రాధ ఉన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

రేగిడి, న్యూస్‌టుడే: బూరాడ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఈనెల 27న పలు గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎల్.హరిబాబు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు అంతరాయం ఉంటుందన్నారు. కాగితాపల్లి, పనసలవలస, పారంపేట, ఉనుకూరు, పోరాం, అంబాడ తదితర గ్రామాల వినియోగదారులు గమనించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి	- 80085 74367
గజపతినగరం	- 80085 74332
రాజాం	- 80085 74308
గరివిడి	- 80085 74348

? గోడియాడ మండల పరిషత్తు పాఠశాలకు వెళ్లే రహదారిపై మురుగు చేరి, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు

● పరిశీలించి మురుగు రాకుండా చర్యలు చేపడతాం. - భానోజీరావు, ఈవోపీఆర్డీ

- న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? రాజాం పట్టణ పరిధి సారధి ప్రాథమిక పాఠశాల సమీప కాలువలో చెత్త నిల్వలతో దోమల బెడద ఎక్కువగా ఉంది. - స్థానికులు

● పరిశీలించి కాలువల్లో చెత్తను తొలగించేందుకు చర్యలు చేపడతాం. - రామప్పలనాయుడు, కమిషనర్ - న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

? విజయరాంపురం(బూరిపేట) పొలాలకు వెళ్లే దారిలో కొన్నిచోట్ల విద్యుత్తు తీగలు కిందికి వేలాడుతున్నాయి. - స్థానిక యువకులు

● పరిశీలించి తీగలను సరిచేస్తాం.

- సోమేశ్వరరావు, ఏఈ - న్యూస్‌టుడే, తెర్లాం

? గరిడ గ్రామ రహదారి అధ్వానంగా ఉంది. గుంతలతో ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు

● నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిస్తాం.

- శ్రీనివాస్, పీఆర్ ఏఈ - న్యూస్‌టుడే, గుర్ల

? రామభద్రపురం పంచాయతీలోని ఎస్సీ వీధి కాలువలో మురుగును తొలగించాలి. - స్థానికులు

● చర్యలు తీసుకుంటాం. - సూరిబాబు, ఈవో

- న్యూస్‌టుడే, రామభద్రపురం

? సీతయ్యపేట ఎస్సీ కాలనీలో బోరు పాడైపోయి ఆరు నెలలైంది. అధికారులకు చెప్పినా బాగు చేయలేదు. - స్థానికులు

● మాకు ఫిర్యాదు రాలేదు. చర్యలు తీసుకుంటాం. - రవికుమార్, ఎంపీడీవో

- న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

పారిశుద్ధ్య పనులు

ఈనాడు కథనానికి స్పందన

రామభద్రపురం: కోటశిర్లాంలో సర్పంచి టి.తిరుపతమ్మ, పంచాయతీ కార్యదర్శి పి.బంగార్రాజు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. కాలువల్లో మురుగుతో ప్రజల ఇబ్బందులపై ఈనెల 23న 'ఈనాడు'లో వెలువడిన కథనానికి స్పందించారు.

గుంతలు తెచ్చిన తంటా



రాజాం పట్టణంలోని రహదారులపై గుంతలతో వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. భారీ వాహనాలు వీటిలో కూరుకుపోయి నిలిచిపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతి రోజు ఇదే పరిస్థితి చోటు చేసుకుంటోంది. నిలిచిపోయిన రహదారి విస్తరణ పనులు ప్రారంభించాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు. - న్యూస్‌టుడే, రాజాం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ప్రతిభ చూపిన జట్టు

బొబ్బిలి గ్రామీణం, రామభద్రపురం, న్యూస్‌టుడే: పారాది ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక బుధవారం జరిగింది. జిల్లాలోని 30 పాఠశాలల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ ఆధారంగా బాలబాలికల జట్లు ఎంపిక చేసినట్లు పీడీలు వెంకటనాయుడు, సత్యనారాయణ, అప్పలనాయుడు తెలిపారు. వీరికి నెల రోజులపాటు శిక్షణ ఇచ్చి పోటీలకు పంపిస్తామని తెలిపారు. నవంబరులో అనంతపురం, కాకినాడలో జరగనున్న అండర్-14, 19 విభాగాల్లో పాల్గొంటారని చెప్పారు. రామభద్రపురం మండలం ఆరికతోట విద్యార్థులు శ్యామ్‌మోహన్, మధు, జ్యోతి, ప్రకాష్, ధనలక్ష్మి, తేజేశ్వరరావు, భువనేశ్వరి, శ్రావణి ఎంపికైన వారిలో ఉన్నారు.

అమృత భారత్
ఆధునిక హంగులు

వేగంగా బొబ్బిలి రైల్వే స్టేషన్ అభివృద్ధి

'అమృత భారత్' పథకం కింద బొబ్బిలి రైల్వే స్టేషన్‌కు ఆధునిక హంగులు కల్పిస్తున్నారు. పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టడంతో బ్రిటిష్ కాలంనాటి ఈ రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక శోభ సంతరించుకోబోతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 26న సుమారు రూ.16 కోట్లతో అధికారులు పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ఈ పనుల్ని ప్రారంభించారు. - న్యూస్‌టుడే, బొబ్బిలి


కొత్త సముదాయ భవనం

ప్రస్తుతం మూడో లైను పనులు ఓవైపు జరుగుతుండగా ప్లాట్‌ఫారాల అభివృద్ధి, ప్రయాణికుల విశ్రాంతి గదులు, రిజర్వేషను కౌంటర్లు, ఇతర పనులు మరోవైపు సాగుతున్నాయి. పాతవి తొలగించి కొత్తవి నిర్మిస్తున్నారు. బుకింగు కౌంటర్, మరికొన్ని షెడ్లను తొలగించారు. కొత్తగా స్టేషన్ భవన సముదాయాన్ని, గూడ్సు షెడ్డు స్థలంలో నూతన భవనాలు నిర్మించారు. బుకింగు కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. విశ్రాంతి గదులు, లోకో పైలట్, ఇతర ఉద్యోగుల విశ్రాంతి గదులు కూడా నిర్మిస్తున్నారు. ఈ పనుల్లో భాగంగానే పట్టణంలోని మల్లంపేట వద్ద నూతన వంతెన నిర్మాణం చేపట్టనున్నారు.

ఏడాదిలోగా..

బొబ్బిలి మీదుగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ వంటి ప్రాంతాలకు రైళ్లు వెళ్తున్నాయి. ఇటీవల కొత్తగా మరిన్ని అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల స్టేషన్‌కు ప్రాధాన్యత పెరిగింది. మూడో లైను పనుల్లో భాగంగా అదనంగా మరో ప్లాట్‌ఫారం ఏర్పాటు కానుంది. దీనికి అనుగుణంగా డిజిటల్ సైన్ బోర్డులు, విద్యుద్దీకరణ వంటివి చేపడుతున్నారు. బుకింగు కౌంటర్ నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తాత్కాలికంగా కంటైనర్‌లో ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. పనులు పూర్తిచేసి ఏడాదిలోగా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామని స్థానిక రైల్వే అధికారులు 'న్యూస్‌టుడే'కు వెల్లడించారు.


మూడో వరుస పనులు

కృషి చేస్తాను

బొబ్బిలి రైల్వేస్టేషన్‌కు చరిత్ర ఉంది. ఇటీవల కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును కలిసి సమస్యలు తెలియజేశాం. అంతర్జాలం ద్వారా రైల్వే డీఆర్ఎంకు విన్నవించాలని సూచించారు. ఆయా సమస్యలు దశల వారీగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తాను. - బేబీనాయన, ఎమ్మెల్యే

వీటికి పరిష్కారం చూపాలి

బొబ్బిలి రైల్వే స్టేషన్‌కు సంబంధించి కొన్ని సమస్యలు ఏళ్లుగా ఉన్నాయి. ఇక్కడి గూడ్సు షెడ్డును మరో చోటుకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హమాలీలు ఆందోళన చేస్తున్నారు. బొబ్బిలి-సాలూరు మధ్య రైలు నడుపుతామని రైల్వే శాఖ ఆరు నెలల క్రితం ప్రకటించింది. ఇంతవరకు కార్యాచరణకు నోచుకోలేదు. ఇది అందుబాటులోకి వస్తే సుమారు 30 గ్రామాలకు సౌకర్యవంతంగా ఉంటుంది. బొబ్బిలి పట్టణ పరిధిలోని మల్లంపేట, ఇందిరమ్మ కాలనీ, బొబ్బిలి మండలం గున్నతోటవలస, దిబ్బగుడివలస, జగనన్న కాలనీలకు వెళ్లాలంటే రైల్వే ట్రాకులు దాటాల్సి ఉంది. ఇక్కడ మినీ వంతెనలు ఏర్పాటు చేయాలి. పట్టణం మీదుగా వెళ్లే వందేభారత్, హడియా-యశ్వంత్‌పూర్ సూపర్‌ఫాస్టు రైళ్లను నిలుపుదల చేయాలని ప్రయాణికులు, ప్రజాప్రతినిధులు ఇటీవల రైల్వే ఉన్నతాధికారులకు వినతులు సమర్పించారు.

తప్పని తాగునీటి కష్టాలు

ఆగూరు ప్రాథమికోన్నత పాఠశాల వద్ద శుద్ధజల యంత్రాలు మూలకు చేరాయి. గత మూడు నెలలుగా ఇవి పనిచేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నుంచి సీసాలతో తెచ్చుకుంటున్నారు. అధికారులు వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.సూర్యం వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. - న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం



ఎప్పుడో మోక్షం..?



పాయసన్నగెడ్డకు వచ్చిన వరదలకు మల్లయ్యపేట-హొంజరాం రహదారి కోతకు గురై కొట్టుకుపోయింది. రాకపోకలు సాగించే 15 గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పాడైన రహదారిని బాగు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ ఏఈ రియాజ్ తెలిపారు. - న్యూస్‌టుడే, సంతకవిటి

బాలికలకు అండగా పోలీసుశాఖ


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సతీష్‌కుమార్

బొబ్బిలి, న్యూస్‌టుడే: బాలికలకు అండగా పోలీసు శాఖ ఎల్లప్పుడూ ఉంటుందని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై బుధవారం పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. బాలికలు ఎలాంటి ఇబ్బందులకు గురైనా పోలీసులను ఆశ్రయించవచ్చన్నారు. పాఠశాలకు వెళ్తున్న, వస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వెంబడించి ఇబ్బంది పెడితే వెంటనే పోలీసులకు ఫోన్ చేయాలన్నారు. సీఐ సతీష్‌కుమార్ గుడ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. హెచ్ఎం జగదీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

దత్తిరాజేరు, మెంటాడ: గ్రామాల్లో పెండింగులో ఉన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ప్రత్యేకాధికారి జోసెఫ్ అన్నారు. దత్తిరాజేరు మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 28 నుంచి 'మన ఇల్లు- మన గౌరవం' పేరుతో ప్రారంభించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, డీఈ సత్యనారాయణ, ఏఈ శ్రీనివాసరావు ఉన్నారు. 2025 మార్చి నాటికి పెండింగ్ ఇళ్లు పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రత్యేకాధికారి ప్రమీలాగాంధీ మెంటాడలో అన్నారు. ఎంపీడీవో త్రినిక్షరావు, తహసీల్దార్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సూచనలు చేస్తున్న ప్రత్యేకాధికారి జోసెఫ్

డ్రోనుతో పురుగుల మందు పిచికారీ


రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్యామ్‌సుందర్

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కారాడలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. బొబ్బిలి డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు మజ్జి శ్యామ్‌సుందర్ డ్రోను ద్వారా పంటలకు పురుగు మందులు పిచికారీ చేయడంపై రైతులకు అవగాహన కల్పించారు. దీనివల్ల తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేయొచ్చన్నారు. ఉద్యాన శాఖాధికారి వెంకటరత్నం, వ్యవసాయశాఖ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలు.. అమర జీవి


రాజాం: నివాళులర్పిస్తున్న ప్రముఖులు


గరివిడిలో..

రాజాం, గరివిడి, న్యూస్‌టుడే: గానగంధర్వుడిగా ప్రజల గుండెల్లో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎప్పటికీ నిలిచిపోతారని రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షుడు కొత్త సాంబమూర్తి, మంటపాలకళాశాల నిర్వాహకుడు ఎం.ప్రసాదరావు, ప్రముఖ రంగస్థల నటుడు జి.ఆదినారాయణ అన్నారు. బాలు వర్ధంతి సందర్భంగా రాజాం పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలు పాటలకు మరణం లేదని సహాయ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీనివాసరావు అన్నారు. గరివిడి ఉపాధ్యాయ కాలనీలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచి పి.ప్రమీల పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు


గజపతినగరంలో విద్యార్థుల యోగా


గుర్లలో కబడ్డీ

గజపతినగరం, గరివిడి, గుర్ల, న్యూస్‌టుడే: గజపతినగరంలోని మరుపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడా సంచాలకుడు సత్యనారాయణ, క్రీడల కార్యదర్శి సునీత ఆధ్వర్యంలో మండలస్థాయి పాఠశాల పోటీలు బుధవారం నిర్వహించారు. ఎంపీపీ జ్ఞానదీపిక, సర్పంచి రామలక్ష్మి, ఎంఈవో విమలమ్మ ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుంచి 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గరివిడి వెదర్ పరిశ్రమ క్రీడా మైదానంలో జరిగిన పోటీల్లో అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఈవో పి.రామారావు, పీడీలు సూర్యలక్ష్మి, ఉషారాణి, రమేష్, శేఖర్‌బాబు, సత్యనారాయణ, శ్రీకాంత్, అప్పారావు పోటీలను నిర్వహించారు. ● గుర్లలో జట్టివలస ఉన్నత పాఠశాలలో కబడ్డీ పోటీలను ఎస్ఐ అప్పలనాయుడు, నేతలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఈవోలు బానుప్రకాష్, శ్రీనివాసరావు, నియోజకవర్గ క్రీడల కో-ఆర్డినేటర్ లక్ష్మి తదితరులు ఉన్నారు.

శంకుస్థాపనతో సరి..!


కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి భాస్కరరావు

వంగర, న్యూస్‌టుడే: మండలంలో 46,529 మంది జనాభాకు వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒక్కటే ఉంది. ఎన్నికల ముందు హడావుడిగా మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అరసాడలో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ ఇంతవరకు నిర్మాణం జరగలేదు. భవనం లేకున్నా ఇద్దరు వైద్యుల్ని మాత్రం నియమించారు. ఒక వైద్యుడు ఈశ్వరరావు 104 సేవలు అందిస్తుండగా మరొకరు సౌమ్య సంతకవిటి ఆరోగ్య కేంద్రానికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఇక్కడ సేవలు అందకపోవడంతో 17 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వంగర పీహెచ్‌సీకి, లేదా ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు వద్ద ప్రస్తావించగా.. ఇటీవల స్థలం పరిశీలించామని, అదనంగా ఫార్మసిస్టు, ల్యాబ్ అసిస్టెంటు ఏర్పాటుకు ఎమ్మెల్యేతో మాట్లాడి, నివేదికలు పంపినట్లు చెప్పారు.

అవీ..ఇవీ..అన్నీ



గద్దెకు అభినందనలు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టరుగా మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావును ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.శ్రీనివాసరావు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసరావు



బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సాలూరు నుంచి బదిలీపై వచ్చారు. కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న పనులు సత్వరమే జరిగేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అన్నారు.

చట్టాలను రద్దు చేయాలి

రేగిడి, న్యూస్‌టుడే: కార్మికులకు వ్యతిరేకంగా భాజపా ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని సిటు నాయకుడు, ఈఐడీప్యారీ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు డిమాండు చేశారు. కర్మాగారం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: నారసింహునిపేట ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు ఎన్.రమేష్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని సత్కరించారు. ఉప విద్యాశాఖాధికారి మోహనరావు, మక్కువ ఎంఈవో శ్యామ్‌సుందర్, ప్రధానోపాధ్యాయుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

26న మెగా రక్తదాన శిబిరం

బొబ్బిలి, న్యూస్‌టుడే: స్థానిక అభ్యుదయ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 26న గొడువీధి క్యాంపస్‌లో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు చింత శారద తెలిపారు. రక్తదాతలు ముందుకు రావాలని కోరారు.

చర్యలు తీసుకోండి

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు అందిస్తున్న ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు తేలిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ హిందూ ఉత్సవ సమితి, చైతన్య సమితి సభ్యులు సంయుక్తంగా తహసీల్దారు శ్రీనుకు వినతిపత్రం అందజేశారు.

బైండోవర్ కేసులు నమోదు

రామభద్రపురం, న్యూస్‌టుడే: అక్రమంగా మందుగుండు సామగ్రి అమ్మినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వై.ప్రసాదరావు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. కొట్టక్కి, మిర్తివలస గ్రామాల్లో అయిదుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

ప్రశాంతంగా చెకుముకి పరీక్షలు

బొబ్బిలి, రామభద్రపురం, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని బొబ్బిలి గురుకుల పాఠశాల, వేణుగోపాల ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు బుధవారం జరిగాయి. మండల విద్యాశాఖాధికారి-2 గౌరీశంకర్ పరీక్షా పత్రాలు ఆవిష్కరించారు. రామభద్రపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వద్ద బొబ్బిలి డిప్యూటీ డీఈవో మోహనరావు ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. 320 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మండల కన్వీనర్ శశిభూషణ్‌రావు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు నాగభూషన్‌రావు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

గుర్ల, న్యూస్‌టుడే: వల్లాపురం ఉన్నత పాఠశాలకు చెందిన సి.అశ్రిత జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైందని పీడీ తిరుపతిరావు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు అప్పారావు అభినందించారు. చింతలపేట ఉన్నత పాఠశాలకు చెందిన కె.మురళీ జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ లక్ష్మణ్ తెలిపారు.

ప్రత్యేక నిఘా

బొబ్బిలి, న్యూస్‌టుడే: రైళ్లలో మత్తుపదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామని రైల్వే సీఐ రవికుమార్ తెలిపారు. బుధవారం రైల్వే ఔట్ పోస్టును సందర్శించి, సిబ్బందితో సమీక్షించారు. రైళ్లలో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎప్పటికప్పుడు ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించాలని సూచించారు.

ఎన్డీయే ప్రభుత్వంలో సంక్షేమం

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లిలోని వంగపల్లిపేటలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు పాల్గొని, మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తోందన్నారు. నాయకులంతా ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీడీవో కె.రామకృష్ణరాజు, కూటమి నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


వంగపల్లిపేటలో స్టిక్కరు అంటిస్తున్న నాయకులు

సీబీఎం పాఠశాల తరలింపు సరికాదు


పట్టణంలో వామపక్ష నేతల రాస్తారోకో

బొబ్బిలి, న్యూస్‌టుడే: పట్టణంలో చరిత్ర కలిగిన సీబీఎం పాఠశాలను తరలించొద్దంటూ వామపక్ష నేతలు బుధవారం పాఠశాల ముందు రాస్తారోకో నిర్వహించారు. పాఠశాల ముందు నినాదాలు చేసి ప్రధాన రహదారిపై వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. వీటికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని సిటు జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, రైతు సంక్షేమ సంఘ అధ్యక్షుడు వి.లక్ష్మునాయుడు, ఇఫ్టూ నాయకులు ఎం.గోపాలం డిమాండు చేశారు. పాఠశాలను ఇదే భవనంలో నిర్వహించకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. సీబీఎం చర్చి బాధ్యుడు అదృష్టకుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

సంతకవిటి, న్యూస్‌టుడే: లాభాసాటి పంటలకు సేంద్రియ ఎరువుల ప్రాధాన్యతను రాజాం వ్యవసాయశాఖ సహాయక సంచాలకుడు కె.చంద్రరావు రైతులకు తెలిపారు. సంతకవిటి మండలంలోని జీఎన్‌పురంలో బుధవారం ఏవో నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచి పి.ఈశ్వరరావు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలు చేస్తున్న ఏడీ చంద్రరావు

తప్పిన ప్రమాదం


రహదారిపై తెగిపడిన విద్యుత్తు తీగ

తెర్లాం, న్యూస్‌టుడే: పెరుమాళి నుంచి నెమలాం వెళ్లే దారిలో ప్రధాన రహదారి పక్కన కొత్తగా రైస్‌మిల్లు నిర్మిస్తున్నారు. ఆ మిల్లుకు వేసిన విద్యుత్తు తీగ ఒకటి బుధవారం మధ్యాహ్నం తెగి ప్రధాన రహదారిపై పడింది. ఆ సమయానికి ఎవరూ ప్రయాణించకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్తు శాఖ సిబ్బంది చేరుకుని, తీగలను సరిచేశారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చూస్తామని ఏఈ సోమేశ్వరరావు 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

? మహారాణిపేటలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. గుంతల్లో దిగి పైపుద్వారా నీరు పడుతున్నాం. – గోవిందరావు, స్థానికుడు
● పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
– వైకుంఠంనాయుడు, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్
– న్యూస్‌టుడే, భోగాపురం

? విశాఖ నుంచి విజయనగరం వచ్చేందుకు రాత్రి వేళల్లో ఎక్స్‌ప్రెస్‌లు ఉండడం లేదు. – రామరాజు, కొత్తాగ్రహారం
● అవసరం మేరకు సర్వీసు ఏర్పాటు చేస్తాం. – శ్రీనివాసరావు, డీఎం

? రాజులకాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. – రామచంద్రరాజు, స్థానికుడు
● సిబ్బందిని పంపించి, బాగుచేయిస్తాం.
– ఎస్.అప్పారావు, డీఈఈ, నగర పాలక సంస్థ
– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

వెలుగులొచ్చాయ్

స్పందనకు వందనం

విజయనగరం పట్టణం: నగరంలోని స్టేడియంపేట, కల్యాణి నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను డీఈఈ ఎస్. అప్పారావు దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకున్నారు.

రోడ్లకు మరమ్మతులు

జామి: రామయ్యపాలెం - లొట్లపల్లి, అలమండ రైల్వే స్టేషన్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రూ.1.08 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని ఏఈ శ్రీనువాసరావు బుధవారం 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: ఎల్.కోట విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో ఈనెల 27న నిర్వహణ పనులు చేపడుతున్నట్లు ఆ శాఖ ఇంజినీరింగు అధికారి ఐ.కృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని, కళ్లెంపూడి, గొల్జాం, సీతారాంపురం, పాటూరు, బొద్దాం తదితర గ్రామాల వినియోగదారులు సహకరించాలన్నారు.

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

ప్రజారోగ్యంపై దృష్టిసారించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న భాస్కరరావు

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్యంపై సిబ్బంది దృష్టి సారించాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు ఆదేశించారు. బుధవారం విజయనగరం మండలంలోని రాకోడు, జొన్నవలసలో ఉన్న ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలని, అనారోగ్యంతో ఉన్నవారిని గుర్తించి వెంటనే మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వైద్యాధికారిణి అఖిల, సీహెచ్‌వో మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షంలో ఉన్నానని.. నా డివిజన్‌లో పనులొద్దన్నారు

• గత ప్రభుత్వ తీరును ఎండగట్టిన రాధామణి
• వాడివేడిగా నగర పాలిక సాధారణ సమావేశం

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం



మాట్లాడుతున్న కమిషనరు నల్లనయ్య, చిత్రంలో మేయర్ విజయలక్ష్మి, ఇతర అధికారులు

విజయనగరం నగరపాలక సంస్థ పాలకవర్గ సాధారణ సమావేశం బుధవారం వాడివేడిగా జరిగింది. కూటమి ప్రభుత్వం రాకతో సమస్యలపై కార్పొరేటర్లు ఎట్టకేలకు గొంతెత్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సమావేశం 3.15 గంటల పాటు సాగింది. మేయరు వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశం మధ్యాహ్నం 2.15 వరకు జరిగింది. తొలుత వైకాపా కార్పొరేటరు అల్లూ చాణక్య కుళాయి కనెక్షన్ల మంజూరు విషయాన్ని ప్రస్తావించారు. పరిపాలన కార్యదర్శులు సచివాలయాలకు వచ్చి దరఖాస్తు చేయాలని చెబుతున్నారని మండిపడ్డారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ నిర్వహణలో ప్రొటోకాల్ పాటించడం లేదని ఆరోపించారు.



గత ప్రభుత్వంలో జరిగిన లోపాలను తెలియజేస్తున్న తెదేపా కార్పొరేటర్ రాధామణి

నిబంధనలకు అనుగుణంగానే..

దీనిపైన కమిషనర్ పి.నల్లనయ్య మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారమే దరఖాస్తులను ఆహ్వానించామన్నారు. ఆన్‌లైన్‌లో కూడా వివరాలు నమోదు చేసుకోవచ్చని.. ఈ విధానంతో ఎక్కడా అవినీతి ఉండదని చెప్పారు. స్థానిక కార్పొరేటర్లు కూడా స్వీకరించొచ్చన్నారు. వారి ప్రాధాన్యతను ఎప్పుడూ తగ్గించమన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో అందరూ పాల్గొనవచ్చని, ప్రత్యేకంగా ఆహ్వానితులు ఎవరూ ఉండరన్నారు.

ఇప్పుడు గుర్తొంచిందా ?

తన డివిజన్‌లో వీధిదీపాలు వేయాలన్నా.. చేతిపంపులకు మరమ్మతులు చేయాలన్నా వైకాపా నాయకులు చెబితేనే అప్పటి అధికారులు స్పందించేవారని 49వ డివిజన్ కార్పొరేటర్(తెదేపా) కర్రోతు రాధామణి ధ్వజమెత్తారు. కార్పొరేటరు అయినా.. తనపై పోటీ చేసి ఓడిపోయి మూడో స్థానంలో నిలిచిన వ్యక్తి మాటే చెల్లుబాటు అయ్యేదన్నారు. ఏ పనికైనా ఆయన అనుమతి ఇప్పించాలని అడగమనేవారని.. ఆయనను కలిస్తే మీరు ప్రతిపక్షంలో ఉన్నారని ఎద్దేవా చేశావారన్నారు. పనులు కూడా చేయనిచ్చేవారు కాదని వాపోయారు. తన డివిజన్ ప్రజలకు తాగునీరు కూడా అందించేవారు కాదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని కార్యక్రమాలకూ దూరం పెట్టేవారని, అప్పుడు గుర్తుకురాని ప్రోటోకాల్.. ఇప్పుడు గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు.

సమస్యల వెల్లువ

నగరంలోని 35, 36 డివిజన్లకు సంబంధించిన ప్రజలకు ఉపయోగకరంగా ఉన్న బస్‌షెల్టరును గతంలో తొలగించడంతో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని కార్పొరేటర్లు బాలి పద్మావతి లేవనెత్తారు. ● కుళాయి ద్వారా రంగునీరు వస్తోందని చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని 46వ డివిజన్ కార్పొరేటర్ బి.గోవిందమ్మ ప్రశ్నించారు. ● మరో కార్పొరేటరు మాట్లాడుతూ మూడున్నరేళ్ల నుంచి పారిశుద్ధ్య పనులు చేయడానికి పుష్‌కార్టులు, డంపర్ బిన్లు, సిబ్బంది కొరత ఉన్నా పట్టించుకోలేదన్నారు.

అజెండాలోని అంశాలివీ.. అజెండాలో పొందుపరిచిన 28 అంశాలను ఆమోదించినట్లు మేయరు విజయలక్ష్మి ప్రకటించారు. ● ప్రశాంతినగర్‌లో పట్టణ ఆరోగ్య కేంద్రం మిగిలిన పనులకు రూ.35 లక్షల సాధారణ నిధుల మంజూరు అంశంపై చర్చించారు ● ఉద్యానాలు, ఇతర ప్రాంతాల్లో ఎక్కువ మంది కార్మికులను చూపించి తక్కువ మందితో పనులు చేయిస్తున్నారని, దీంతో నగదు పక్కదారి పడుతోందని కొందరు తెలియజేశారు ● గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన క్లాప్ వాహనాలకు సంబంధించిన చెల్లింపులపై మాట్లాడారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



పెదతాడివాడలో పైడితల్లి అమ్మవారి సిరిమాను చెట్టు వద్ద బుధవారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. – న్యూస్‌టుడే, డెంకాడ

ఉద్యోగులకు బదిలీలు

డెంకాడ, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులకు బదిలీలు జరిగినట్లు బుధవారం ఉత్తర్వులు వచ్చాయని ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు. ఈవోపీఆర్డీ శంకర్ జగన్నాథం నెల్లిమర్ల మండలానికి, జూనియర్ సహాయకులు పవన్‌కుమార్ గుర్ల మండలం, టైపిస్టు పాపారావు తెర్లాం మండలానికి బదిలీపై వెళ్లనున్నట్లు చెప్పారు. ఇద్దరు ఆఫీస్ సబార్డినేటర్లు, 18 మంది పంచాయతీ కార్యదర్శులు, 13 మంది సంక్షేమ సహాయకులు, 8 మంది ఇంజినీరింగ్ సహాయకులు, 16 మంది డిజిటల్ సహాయకులు, ఒక మహిళా పోలీసుకు బదిలీలు జరిగాయన్నారు.

29న బాల్ బ్యాడ్మింటన్ ఎంపికలు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి అండర్-19 బాల్ బ్యాడ్మింటన్ ఎంపికలు బొబ్బిలి సమీప నెమలాం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 29న జరుగుతాయని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, లక్ష్మణరావు తెలిపారు. ఎంపికైన వారు జిల్లా జట్టు తరఫున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

నూతన కార్యవర్గం

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టి. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా జి.లక్ష్మణరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన ఎన్నికల్లో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరీమణి, నాగమణి, సతీష్, సింహాచలం, రవికుమార్, చందు, రాజేష్, గోవిందు సభ్యులుగా ఎంపికయ్యారన్నారు.

కూలిన పాఠశాల ప్రహరీ



భోగాపురం మండలంలోని ముంజేరు ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణం ఒక్కసారిగా కూలిపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ ప్రాంతంలో గతంలో బావి ఉండేదని, అక్కడే కొత్తగా ప్రహరీ నిర్మించటంతో ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయిందని చెబుతున్నారు. ఉన్నతాధికారులకు నివేదించి నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని ఎంఈవో రమణమూర్తి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.
– న్యూస్‌టుడే, భోగాపురం

దేవాలయ భూముల సర్వే

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ వేణుగోపాలస్వామి, రామలింగేశ్వరస్వామి దేవస్థానాలకు చెందిన భూములను సాగు చేస్తున్న రైతులంతా శిస్తు చెల్లించాలని ఈవో జగదీశ్వరి అన్నారు. బుధవారం కొనాడ గ్రామానికి చెందిన ఆలయ భూములను సర్వే చేశారు. అనంతరం రైతుల నుంచి రూ.14,500 శిస్తు వసూళ్లు చేశారు. మిగిలిన భూములను సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తారని తెలిపారు. ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ వి.నాగరాజశర్మ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న రెవెన్యూ, దేవస్థానం అధికారులు

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మొక్కలు నాటుతున్న కమిషనరు, ఐవీపీ.రాజు తదితరులు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ @ 2047లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగర పాలక సంస్థ కమిషనరు పి.నల్లనయ్య కోరారు. బుధవారం 47వ డివిజన్ కంటోన్మెంట్ పాఠశాలలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సహాయ కమిషనరు తిరుమలరావు, ఈఈ కె.శ్రీనివాసరావు, ఉద్యాన అధికారిణి ఉమాభరణి, నాయకులు ఐవీపీ.రాజు, కర్రోతు నరసింగరావు, ప్రసాదుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో

విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన వారు, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లోనూ తైక్వాండో క్రీడాకారులు సత్తా చాటాలని జిల్లా క్రీడా అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. స్కూల్‌గేమ్స్ అండర్- 14, 17 బాల, బాలికల తైక్వాండో జిల్లాస్థాయి జట్ల ఎంపికలను బుధవారం రాజీవ్ మైదానంలో నిర్వహించారు. క్రీడా అధికారి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కె.కృష్ణంరాజు, ఒలింపిక్ సంఘం నాయకుడు వి.మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాలక్షేపానికి సమావేశాలు పెట్టడం లేదు



అధికారులను హెచ్చరిస్తున్న ఉపకలెక్టరు సుధారాణి

భోగాపురం, న్యూస్‌టుడే: 'కాలక్షేపానికి మీ ముందు కూర్చోవడానికి ఇక్కడకు రాలేదు. ప్రభుత్వ కార్యక్రమాలంటే ఏ ఒక్కరికీ లెక్కలేకుండా పోతుంది.' అని ఉపకలెక్టరు సుధారాణి మండల స్థాయి అధికారులపై మండిపడ్డారు. ఈనెల 28న హౌసింగ్‌డే కార్యక్రమానికి సంబంధించి భోగాపురం వెలుగు కార్యాలయ భవనంలో బుధవారం నిర్వహించిన మండలస్థాయి సమావేశానికి పలుశాఖల అధికారులు, సిబ్బంది హాజరుకాకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 'గత రెండు, మూడు సమావేశాలుగా చూస్తున్నానని, ఇలాంటి పరిణామాలే ఎదురవుతున్నాయని, ఈ సారి క్షమించేది లేదని' హెచ్చరించారు. ప్రణాళికతో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను.. ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్న వారిపై చర్యలు తప్పవన్నారు. గృహ లబ్ధిదారులు డిసెంబరు, మార్చి నెలాఖరు నాటికి రెండు విడతల సమయంలో గృహాలు నిర్మించుకోకపోతే ప్రభుత్వం నుంచి ఎలాంటి బిల్లులు రావని, ఈ విషయాన్ని నేరుగా. . నూతనంగా మంజూరు చేసిన స్థలాల్లో ఇళ్లు కట్టుకుంటున్నవారికి తెలియజేయాలన్నారు. ఎంపీడీవో అప్పలనాయుడు, ఉపతహసీల్దారు శ్రీనివాసరావు, ఏవో బంగారయ్య తదితర సిబ్బంది పాల్గొన్నారు.




కడలికి జీవితకాల సాఫల్య పురస్కారం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నగర పంచాయతీ పరిధి జరజాపుపేట ప్రాంతానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, సాహితీవేత్త కడలి ప్రకాశరావుకు హైదరాబాద్‌కు చెందిన సాహితీ సాంస్కృతిక కళా సంస్థ, ఆదర్శ కళానిలయం వారు జీవితకాల సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఐపీఎస్ అధికారి రామ్‌రెడ్డి భూక్య, నటులు రాజేంద్రకుమార్, గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన కలిశెట్టి

విజయనగరం అర్బన్: రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు బుధవారం విశాఖలో విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. భగవద్గీత పుస్తకం, పుష్పగుచ్ఛం అందించారు. కార్పొరేషన్ పదవుల్లో జిల్లాకు ప్రాధాన్యం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.



ప్రజాసంక్షేమమే ధ్యేయం

లక్కవరపుకోట, శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సాగుతోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. బుధవారం కిత్తన్నపేట గ్రామంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ● కృష్ణాపురం, చామలాపల్లి గ్రామాల్లో ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుబ్బలక్ష్మి తదితరులు కరపత్రాలు పంపిణీ చేశారు.



కిత్తన్నపేటలో స్టిక్కరు అతికిస్తున్న ఎమ్మెల్యే

సంక్షిప్త సమాచారం

నూతన కార్యవర్గం ఎన్నిక

మయూరి కూడలి, న్యూస్‌టుడే: ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్-విజయనగరం హరివిల్లు నూతన జిల్లా అధ్యక్షుడిగా కె.వి.ఎస్.సూర్యారామారావు ఎన్నికయ్యారు. బుధవారం విజయనగరంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా జె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కె. జయశ్రీతో పాటు 18 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

రూ.లక్ష చెక్కు అందజేత

వేపాడ: సోంపురం గ్రామానికి చెందిన జాగరపు ప్రసాద్ ఇటీవల జరిగిన పేలుడు ఘటనలో గాయపడగా.. బుధవారం జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు రూ.లక్ష చెక్కును అందజేశారు.

మద్యంతో వ్యక్తి అరెస్టు

లక్కవరపుకోట: గనివాడ శివారు నిడిగట్టు గ్రామంలో 25 మద్యం సీసాలతో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు. సీసాలను స్వాధీనం చేసుకుని అతనిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

జూద శిబిరంపై దాడి

పూసపాటిరేగ: మండల కేంద్రం యాతపేట సమీపంలో జూద శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. 10 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద రూ.2,845 నగదును సీజ్ చేశారు. ఎస్సై దుర్గాప్రసాద్ కేసు నమోదు చేశారు.

గొలుసు దుకాణంపై దాడి

పూసపాటిరేగ: తిప్పలవలస గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం గొలుసు దుకాణంపై పోలీసులు దాడి చేశారు. 24 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నెల్లిమర్ల నగర పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్న బి.వెంకట్ ఆకస్మికంగా మృతి చెందారు. వెంకట్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు టీవీ.రమణ, ఎ.జగన్‌మోహన్‌రావు డిమాండ్ చేశారు. కార్మికుల ఒక్కొక్కరు రూ.500 సహాయం ప్రకటించారు.

విద్యార్థుల రక్తదానం



విద్యావిభాగం, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్, సీతం ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు 200 యూనిట్ల రక్తాన్ని అందించారు. వైద్యులు డా. మహేష్, నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

విజయనగరం పట్టణం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆనందగజపతి ఆడిటోరియంలో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కర్రోతును కలిసిన నాయకులు

విజయనగరం అర్బన్, గంట్యాడ గ్రామీణం: తెదేపా గంట్యాడ మండలాధ్యక్షుడు కొండపల్లి భాస్కరనాయుడు, సీనియర్ నాయకుడు జి.శ్రీనివాసరావు బుధవారం మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి హామీ పథకం గునపాలు విక్రయం



ఆటోలో ఎన్‌ఆర్‌జీఎస్ ముద్రతో ఉన్న గునపాలు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం ద్వారా సరఫరా అయిన గునపాలు గ్రామాల్లో ఆటోలు విక్రయిస్తున్న ఘటన బుధవారం ఎస్.కోట మండలం బొడ్డవరలో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. ఓ వ్యక్తి ఆటోలో గునపాలు తెచ్చి గ్రామంలో విక్రయించారు. వాటిపై ఉపాధి హామీ పథకం గుర్తు ఉండడంతో అనుమానం వచ్చి కొందరు ప్రశ్నించారు. తాను కొనుక్కున్నానని, కావాలిస్తే అమ్ముతానని బదులిచ్చాడు. ఈ విషయమై ఉపాధిహామీ పథకం ఏపీవో తిరుపతిరావు వద్ద ప్రస్తావించగా 2015 నుంచి మండలంలో పంపిణీ చేయలేదని, ఇవి ఎక్కడి నుంచి వచ్చాయో తెలియదని చెప్పారు.

కళాశాల విద్యార్థులకు అవగాహన

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సంకల్పం కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని ఏవీఎన్ కళాశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ నారాయణమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు మందు వినియోగానికి అలవాటు పడి విలువైన జీవితాలను పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటివల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలను, విధించబోయే కేసులు గురించి వివరిస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ రూపొందించిన పవర్ పాయింటు ప్రజెంటేషన్‌ను ప్రదర్శించారు. కళాశాలలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయించారు.

30 నుంచి క్లాప్ చోదకుల సమ్మె

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం క్లాప్ చోదకులను ఆదుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు డిమాండు చేశారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈనెల 30 నుంచి సమస్యల పరిష్కారంపై సమ్మె నిర్వహించనున్నామన్నారు. ఉద్ధృతం కాకముందే అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. నాయకులు కల్యాణం అప్పలరాజు, ఎస్.రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

జామి, న్యూస్‌టుడే: జామి మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీల తెదేపా నాయకులు, కార్యకర్తలు బుధవారం జామిలో సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. రానున్న పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని కార్యకర్తలను కోరారు. గ్రామాల్లో సమస్యలేమైనా ఉంటే మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారానికి చర్యలు చేపడతామని అన్నారు. నాయకులు వి.రమణ, పి. స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత నిరసన

తాటితూరు(తగరపువలస): తనకు న్యాయం చేయాలని కోరుతూ స్వాతి అనే వివాహిత తాటితూరులోని మెట్టినింటి ముందు బైఠాయించి నిరసన చేపట్టింది. విజయనగరానికి చెందిన ఈమెకు నాలుగేళ్ల కిందట భాస్కరరావు(సాఫ్ట్‌వేర్ ఉద్యోగి)తో వివాహమైంది. మనస్పర్థల కారణంగా ఆమె ఇటీవల పుట్టింటికి వెళ్లింది. అనంతరం అక్కడికి వెళ్లగా.. ఆమెను ఇంట్లోకి రానివ్వలేదు. దీంతో ఆందోళన చేపట్టింది. పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గండిని శాశ్వతంగా పూడ్చాలి



పనులు చేస్తున్న సొసైటీ సభ్యులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ధర్మవరం గ్రామంలోని కోమటి చెరువు గండిని 400 బస్తాల క్రషరు బుగ్గితో సొంత ఖర్చుతో పూడ్చుకున్నామని, అధికారులు స్పందించి శాశ్వత పనులు చేపట్టాలని అన్నంరాజుపేట మత్యకార సొసైటీ సభ్యులు కోరారు. గండి పడితే చెరువులోని రూ.లక్షల విలువైన మత్స్యసంపద పోతుందన్న భయంతో తాత్కాలికంగా పూడ్చామన్నారు. చర్యలు తీసుకోవాలని సర్పంచి సన్యాసయ్యకు విజ్ఞప్తి చేశారు.

సేంద్రియ ఎరువులను వినియోగించండి



పంటను పరిశీలిస్తున్న సాల్మన్‌రాజు, తదితరులు

నెల్లిమర్ల, డెంకాడ, లక్కవరపుకోట, జామి, న్యూస్‌టుడే: రైతులంతా పంట పొలాలకు సేంద్రియ ఎరువులను తప్పనిసరిగా వాడాలని జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి ఏవీ. సాల్మన్‌రాజు సూచించారు. బుధవారం సతివాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏవో ఎం.పూర్ణిమ, డీఆర్‌సీ వ్యవసాయాధికారి టి.సంగీత తదితరులు పాల్గొన్నారు. ● మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దని గాజులరేగ ఏరువాక కేంద్రం సమన్వయకర్త కె.లక్ష్మణ్ అన్నారు. పినతాడివాడ, బంటుపల్లి గ్రామాల్లో గాజులరేగ పరిశోధనా కేంద్రం కీటక శాస్త్రవేత్త ఎం.స్వాతి, ఉద్యానశాఖ అధికారిణి జి.జ్యోత్స్న పాల్గొన్నారు.

చెకుముకి పోటీలు



కొత్తవలసలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కొత్తవలస, వేపాడ, నెల్లిమర్ల, శృంగవరపుకోట, న్యూస్‌టుడే: విజయనగరం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కొత్తవలస జడ్పీ ఉన్నత పాఠశాల, వియ్యంపేటలోని అంబేడ్కర్ బాలికల గురుకులం, ఓపీ జిందాల్ భారతి, దేవాడ అమరావతి, కేజీబీవీ, నరపాంలోని సూర్యోదయ డిఫెన్స్ కాన్సెప్ట్ స్కూలు, కంటకాపల్లిలో బుధవారం చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష నిర్వహించారు. మండల కన్వీనర్ ఎల్.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.● సోంపురం, వేపాడ, నీలకంఠరాజపురం జడ్పీ ఉన్నత పాఠశాలలు, బక్కునాయుడుపేట ఆదర్శ, అంబేడ్కర్ గురుకులం, కస్తూర్బా పాఠశాలల్లో చెకుముకి పోటీలు జరిగాయి. ● ధర్మవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 62 మంది హాజరయ్యారు. అక్టోబరు 1న మండలస్థాయి పోటీ జరగనుందని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు శివరామకృష్ణ పేర్కొన్నారు.